**కథ**

# పరాయైనవాడు

**యస్. శ్రీదేవి**

**వాళ్లిద్దరూ ప్రేమికులు. ఆ ప్రేమ వయసు ఏడాది. ఒకరినొకరు పరిపూర్ణంగా అర్థం చేసుకున్నామనుకుంటున్నారు. వాళ్ల మధ్య అసంకల్పితంగా మొదలైన ఆ చర్య అద్భుతంగా పూర్తయింది. ఇద్దరికీ అనిర్వచనీయమైన ఆనందం కలిగింది.**

భార్గవ నుంచీ విడివడి దూరంగా జరిగింది నీల. బిడియంగా తల దించుకుంది. పల్చటి సిగ్గు తెర ఆమె ముఖం మీద పరుచుకుంది. అతను చిన్నగా నవ్వాడు. ఆ క్షణాన అతని మనసులో ఏమీ లేదు. నిష్కల్మషంగా ఉంది. తను కొద్ది క్షణాల క్రిందట పొందిన అనుభూతి అతని అణువణువునా కదిలి తరంగాల్లా ఎగిసిపడుతోంది.

''కోణార్క్‌లో వెళ్తున్నాను. మళ్లీ వారం తర్వాత వస్తాను'' అన్నాడు.

''అన్ని రోజులా?'' బెంగగా అంది నీల. ''మీ వాళ్లు మన పెళ్లికి ఒప్పుకుంటారా?'' బేలగా అడిగింది.

''ఒప్పిస్తాను'' స్థిరంగా అన్నాడు.

కొద్దిసేపుండి వెళ్లిపోయాడు.

★ ★ ★

సరిగ్గా పదీ నలభయ్యైదుకి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఉన్నాడు భార్గవ. సూదిమొనంత చీలిక మొదలైంది మనసులో. లావాలా ఎగజిమ్మసాగాయి ఆలోచనలు. ఉదయపు సంఘటన యొక్క మరో పార్శ్వాన్ని దర్శిస్తున్నాడతను.

అలా ఎలా ఒప్పుకోకలిగింది. నీల? ఎప్పుడూ డీసెంటుగా చుడీదార్ డ్రెస్‌లలో ఉండే నీల... తను వస్తున్నాడని ఫోన్ చేశాక కూడా నైటీలోనే ఉండిపోయిందెందుకు? ఇలా జరుగుతుందని ముందే ఊహించిరదా? ఇలా జరగాలని ఆశించిందా? ఛ.. ఛ.. అతనికేమిటో ఇబ్బందిగా అనిపించింది.

పెళ్లికి ముందు ఆడపిల్లలు చాలా జాగ్రత్తగా ఉంటారని చెప్తారు. ఎంత క్లోజు ఫ్రెండునైనా భుజంమీద చెయ్యి కూడా వెయ్యనివ్వరని తెలుసు. తన చెల్లెలికి తల్లి అలాగే చెప్తుంది. మరి నీల? తమవి కులాలు ఒకటి కావు. పెళ్లికి తనింట్లో వాళ్లు ఒప్పుకోరనే సందేహం ఉంది. అందుకని ఇలా బైండ్ చెయ్యాలనుకుందా? ఎబ్బెట్టుగా అనిపిస్తోంది. అసహ్యం కూడా మొదలైంది.

తన బంధువుల పరిధిలో గానీ పరిచయస్తుల్లో గానీ ఎవరూ ఇలా ఉండరు. ఉద్యోగం చేసుకుంటూ, వంటరిగా ఫ్లాట్‌లో ఉండరు. పెద్ద వాళ్లు ఆడపిల్లల్ని పెళ్లవకుండా వేరే ఊళ్లకి పంపరు. పంపినా ఏ బంధువుల ఇంటిలోనో ఉంచుతారు తప్పించి, ఇలా విడిగా ఉంచరు. ఆడపిల్ల ఉద్యోగం, సంపాదనా ప్రధానం కావు. చదువవ్వగానే పెళ్లి చేసి పంపే ఏర్పాట్లు చేస్తారు. మరి ఈ నీలేమిటి ఇలా? ఒక్కర్తీ ఫ్లాట్‌లో ఉంటోంది. ఇలాంటి ఎఫేర్స్ తనకింకా ఉన్నాయేమో! తనతోటే మొదలుకాదేమో! పర్సనాలిటీ, చదువు, ఉద్యోగం... అన్నీ ఉన్న తనని పెళ్లి కోసం ప్రొవోక్ చేసి ట్రాప్ చేసిందేమో! ఎన్నో అనుమానాలతో ఉక్కిరిబిక్కిరైపోయాడు.

మర్నాటికి రైలు ముంబై చేరుకుంది. తల్లిదండ్రులతో అతనింక నీల గురించి ప్రస్తావించలేదు. వారం అనుకున్న సెలవుని మరొక వారం పొడిగించుకుని అక్కడే రెండు మూడు ఇంటర్వ్యూలు ఎటెండయ్యాడు. ఒక దాంట్లో సెలక్టయ్యాడు. చేస్తున్న ఉద్యోగం వదిలేసి అందులో చేరిపోయాడు. ఒక రాత్రికి రాత్రి వెళ్లి ఎవరికీ తెలీకుండా తన సామాన్లన్నీ తెచ్చుకుని వచ్చేశాడు.

అతని తల్లిదండ్రులకి ఇదేం అర్థం కాలేదు. అతను బైటెక్కడో ఉద్యోగం చేస్తున్నంతకాలం వాళ్లకి కొద్దిగా భయం ఉండేది ఎవరేనా అమ్మాయిని ప్రేమించానని హఠాత్తుగా చెప్పేస్తాడేమోనని. ఇప్పుడా భయం పూర్తిగా కాకపోయినా కొంతవరకూ తీరిపోయింది.

★ ★ ★

భార్గవ వెళ్లిన దగ్గర్నుంచీ అతని ఫోన్ కోసం ఎదురుచూసింది నీల. ఒక్క ఫోన్ కూడా చెయ్యలేదు. తనెప్పుడూ చేసే నెంబరుకి చేస్తే కన్నెక్టవ్వలేదు. వారం తర్వాత అతనొస్తాడని ఎదురుచూసింది నీల. అతను రాలేదు. సిమ్‌కార్డు మార్చి తప్పించుకుని తిరుగుతున్నాడేమోననే అనుమానం సన్నగా మొదలైంది. కొద్ది రోజులు గడిచేసరికి దృఢపడింది.

ఎందుకిలా చేశాడు? అందరు మగవాళ్లలాగే ఇతనూనా? అవకాశం తీసుకుని వదిలేశాడా? నమ్మలేకపోతోంది. మరి పెళ్లి మాటలు?

★ ★ ★

''నా కొలీగ్ ద్వారా వచ్చింది. నీ చదువు, ఉద్యోగం చూసి వాళ్లంతట వాళ్లే కబురు పెట్టారు. చాలా మంచి మేచి. నీకూ ఇష్టమైతే మాట్లాడదాం'' నీల తండ్రి ప్రతిపాదన.

నీలలో సందిగ్ధం. భార్గవ కోసం ఇంకా ఎదురుచూడాలా తను? ఇంకా ఆ ఆశ ఉందా? మనసులో ఏ మూలో మొదలైన నైరాశ్యం నిలువెల్లా ఆవరిస్తున్న భావన కలిగింది. తను మోసపోయిందా? అతన్ని నమ్మి... ప్రేమలో పడి మోసపోయిన ఎందరో ఆడపిల్లల్లాగే తనూ మోసపోయిందా? అతన్ని రెసిస్ట్ చేసి ఉండాల్సిందా? మోటుగా తోసేసి, గాయపరిచి తనని తను కాపాడుకోవలసి ఉండెనా? కానీ ఆ క్షణాన అతను తనని ప్రేమించిన వ్యక్తి అనే తప్పించి మరో ఆలోచన రాలేదు. ఆత్మీయుడనిపించాడు గానీ విషం చిమ్ముతున్నట్టుగా అనిపించలేదు. చాలా లవబుల్‌గా అనిపించాడు. అదంతా తన తప్పా? ఆమెకి బాధనిపించలేదు. రోషంగా అనిపించింది.

లోతుగా ఆలోచిస్తే భార్గవ ఇంక రాడని అర్థమైంది. అతని కంపెనీకి ఫోన్ చేస్తే ఆ విషయం నిర్ధారణైంది.

తండ్రికి సమ్మతిని తెలిపింది.

పెళ్లిచూపుల్లో శరత్‌ని చూసింది. అతనికి జరిగిపోయిన సంఘటన గురించి చెప్పాలా? వద్దా? సందిగ్ధం. ఇంకా ఎటూ నిర్ణయించుకోలేకపోయింది.

★ ★ ★

''ఇవాళ పార్టీ ఇస్తున్నాను. మన క్లోజ్ సర్కిల్ ఐదారుగురమే ఉంటాం అందులో. సాయంత్రం ఇక్కడి నుంచీ డైరెక్టుగా వెళ్లిపోదాం'' అన్నాడు శరత్.

''సందర్భం ఏమిటి?'' అడిగేడు భార్గవ. ఇద్దరూ ఈ కొత్త కంపెనీలో కొత్తగా స్నేహితులయ్యారు.

శరత్ చిన్నగా నవ్వాడు. ఆ నవ్వులో ఎప్పుడూ లేని కొత్త భావం. భార్గవకి అర్థమైంది. ''కంగ్రాట్స్'' నవ్వుతూ చెప్పాడు.

''నిన్న పెళ్లిచూపులయ్యాయి. అమ్మాయి అందరికీ నచ్చింది. ఎమ్‌సియ్యే పాసై న్యూ ఎరా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో చేస్తోంది. ఇరవై వేలు సాలరీ'' వివరాలు చెప్పాడు.

భార్గవ భృకుటి ముడివడింది.

అదేం గమనించకుండా శరత్ చెప్పుకుపోయాడు. ''తన పేరు నీల.. చాలా బావుంటుంది.''


భార్గవ భృకుటి విడింది. అప్పుడు గమనించాడు శరత్ అతను అనీజీగా ఉండటాన్ని.

''ఏమైంది?'' వింతగా అడిగాడు.

''చెప్పాలా వద్దా అని ఆలోచిస్తున్నాను''

''ఏమిటి?''

''నీ దగ్గర తన ఫోటో ఉందా? ఒకసారి నిర్ధారించుకున్నాక చెప్తాను.''



పెళ్లిచూపులకి వాళ్లు పంపించిన ఫోటో ఇచ్చాడు శరత్. ఆ ఫోటో నీలదే. తనెరిగిన.. తన్నెరిగిన నీలదే.

''ఈ సంబంధం వదిలిపెట్టెయ్'' క్లుప్తంగా అన్నాడు.

''ఎందుకు?''

భార్గవ ఏదీ దాచలేదు. ''మేమిద్దరం ఏడాది పాటు ప్రేమించుకున్నాం. పెద్దవాళ్లతో మా పెళ్లి గురించి మాట్లాడాలి. వారం రోజులు లీవు పెట్టాను. ఆఫీసులో కొద్దిగా పని మిగిలింది. అది పూర్తి చేసి ట్రైనెక్కి మా ఊరు వెళ్లాలనుకున్నాను. వెళ్లే ముందు తనని కలిసి వెళ్లాలనిపించింది. ఉదయం ఐదు... టైం అప్పుడు. నిద్రకళ్లతో...నైటీలో నన్ను రిసీవ్ చేసుకుంది. కొద్దిగా టెంప్టయ్యాను. తను నన్ను ఆపవలసింది. కానీ తను కూడా తొందరపడింది. ఆ ఆతృత, కోరిక... ఇప్పటికీ నాకు ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. ఆడపిల్లల్లో సహజంగా ఉండే బిడియం ఏమాత్రం చూపించలేదు. తనకి ఇలాంటిది కొత్త కాదేమోననిపించింది. నాది అనుమానమే కావచ్చు. కానీ అంత నిగ్రహం లేని మనిషి రేపు పెళ్లయ్యాక ఇంకెవర్తినేనా తొందరపడ్తే?''

శరత్ ముఖం ఎర్రబడింది. కేరక్టర్ లేని వ్యక్తి... అలాంటామెని ప్రలోభపడి తను చేసుకోవాలనుకున్నాడు. ఆమె వైపు నించీ జరిగింది కూడా పొరపాటే అయితే... కనీసం ఆమె అలా అనుకుంటుంటే తనతో ఆ విషయం చెప్పి ఉండాలి. కానీ చెప్పలేదు. దాచిపెట్టి చేసుకోవాలనుకుంటోంది. మోసగించి చేసుకుందామనుకుంది. అతనిలో కసి.

''నీలా! నేను మిమ్మల్ని చేసుకోవాలనుకోవటం లేదు''

''ఎందుకు?''

''కుడి మోకాలిమీద పుట్టుమచ్చ ఉన్నమ్మాయి పెళ్లికి పనికిరాదట''

''ఎలా తెలిసింది?''

''భార్గవ నా ఫ్రెండు'' అతను ఫోన్ పెట్టేశాడు. ఆమె గాయపడి ఉంటుందనుకున్నాడు. చాలా సంతోషం కలిగింది.

నీలకి అంతా అర్థమైంది. సంబంధం తప్పిపోయిందన్న విషయం ఇంట్లో తనే చెప్పింది.

''కొన్నాళ్లు నాకు సంబంధాలు చూడకండి నాన్నా!'' అంది. అవమానం ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన ప్రశ్నార్థకంగా చూశాడు. ఇంకా అవమానంగా అనిపించింది. జవాబు చెప్పలేని పరిస్థితి..తను సృష్టించుకున్నదే. చాలా బాధనిపించింది. తలదించుకుంది. అక్కడి నుంచీ వెళ్లిపోయింది.

★ ★ ★

''ఇంత కాలం మీరు పెళ్లెందుకు చేసుకోలేదు?'' కుతూహలంగా అడిగాడు ప్రహ్లాద్. ఈమధ్య కాలంలో అతను నీలకి చాలా సన్నిహి

తంగా వచ్చాడు. ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. దాన్ని ప్రేమని ఆమె అనుకోవటం లేదు. అతననుకుంటున్నాడు. అందుకే ఎన్నో ప్రశ్నలు వేస్తాడు. ఆమె అంతరంగాన్ని శోధించే ప్రయత్నం చేస్తాడు.

''నేను చేసింది ఒకే ఒక్క పొరపాటు. అతన్ని ప్రేమించటం. ప్రేమించాను గాబట్టి రాకూడని టైంలో రానివ్వడం... అతను నా మనిషని నమ్మాను. అతని వలన నాకు హాని జరుగుతుందని అనుకోలేదు. అతను నన్ను నమ్మలేకపోయాడు. కనిపించిన ప్రతి మగవాడితో పోతానని భయపడ్డాడు. కానీ నాకలాంటి ఆలోచన రాలేదు. కనిపించిన ప్రతి అమ్మాయితో అఫేర్స్ నడిపే వ్యక్తిగా అతన్ని గురించి అనుకోలేకపోయాను. ఆడవాళ్లని అంటారు గానీ మగవాళ్లే పెద్ద సెంటిమెంటల్ ఫూల్స్. వాళ్లు చేసే న్యాయానికీ అన్యాయానికీ మధ్య హద్దుగీత గీసేది కేవలం మంగళ సూత్రమేనంటే నాకు ఆశ్చర్యమనిపిస్తుంది'' అంది నీల. ''ఆ సంఘటన జరగకుండా ఉండి ఉంటే మేం సఫల ప్రేమికులుగా ఉండేవాళ్లమనుకుంటా. మా పెళ్లి కూడా జరిగి ఉండేది కావచ్చు.''

''దాన్ని పొరపాటనుకుంటున్నారా?'' కుతూహలంగా అడిగాడు ప్రహ్లాద్.

''ఔను'' స్థిరంగా వచ్చింది నీల జవాబు.

''సరిదిద్దుకోవాలనుకుంటున్నారా?''

''ఆ అవకాశం లేదు''

''ఏం?''

''అతను తన సర్కిల్లో అందరికీ నా గురించి చెడ్డగా ప్రచారం చేశాడు.''

''నన్ను చేసుకోగలరా?''

''...?!''

''భార్గవ నాకూ తెలుసు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసి చివరికి ఇక్కడ కలుసుకున్నాం. ఇప్పుడు మేమిద్దరం చేసేది ఒక చోటే. తను పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు కూడా''

''ఆ విషయాన్ని మర్చిపోగలరా?'' అడిగింది నీల. తలూపాడతను.

★ ★ ★

పీటల మీద కూర్చుని బొమ్మల పెళ్లిలా చేసుకోవటానికి ప్రహ్లాద్ సిగ్గుపడ్డాడు. నీలకి కూడా అలాగే అనిపించింది. ఇద్దరికీ, ముప్పైలు దాటాయి. ముఖ్యమైన వాళ్ల సమక్షంలో దండలు మార్చుకుని పెళ్లి రిజిస్టర్ చేసుకున్నారు. రిసెప్షన్ మాత్రం గ్రాండ్‌గా ఏర్పాటు చేశారు.

మళ్లీ నీలని కలుస్తాననుకోలేదు భార్గవ. ప్రహ్లాద్ కొలీగ్‌గా రిసెప్షన్‌కి వచ్చాడు. నీలని అతని పక్కని చూసి ఆశ్చర్యం, కుతూహలం. ప్రహ్లాద్ పెళ్లి చేసుకుంటున్నాడు గానీ పెళ్లికూతురెవరో చెప్పలేదు.

''దాచి పెట్టి చేసుకున్నావా?'' ప్రహ్లాద్ ఎవర్నో రిసీవ్ చేసుకోవటానికి వెళ్లినప్పుడు అడిగాడు.

నీల నవ్వింది. ''నువ్వు చెప్పి ఉంటావనుకున్నాను'' పదునుగా ఉంది ఆమె జవాబు. అతని ముఖం మ్లానమైంది. ''అలా ఎలా చేసుకోగలిగావు?'' మరో ప్రశ్న.

''నువ్వు చేసుకోలేదా? అలాగే. ఇంతకీ మీ ఆవిడకి చెప్పావా ఈ విషయం?''

''ఛ... ఇలాంటివి ఎవరేనా చెప్పుకుంటారా? అదేమంత గొప్ప విషయమని? అఫ్‌కోర్సు. తనకి తెలిసినా పెద్ద ప్రాబ్లం లేదులే. మగవాడిని. నువ్వే జాగ్రత్తగా ఉండాలి.'' అతని గొంతులో అదో లాంటి చులకన భావం.

అసహ్యం వేసింది నీలకి. అందమైన ప్రేమికుడిగా, అగ్నిసాక్షిగా ప్రమాణం చేసిన భర్తగా అతను వేసుకున్న ముసుగులు తొలగిపోయి వికృతంగా కనిపించాడు. ఇంతలో ప్రహ్లాద్ అతిథులని వెంట పెట్టుకుని రావటంతో పక్కకి తప్పుకున్నాడతను.

పార్టీ ముగిసింది. వచ్చినవాళ్లంతా వెళ్లిపోయారు. నీల మనసు భగ్గుమంటోంది. తను ఇంతకాలం తన గురించే ఆలోచించుకుంటూ జరిగిన చర్యలో తన పొరపాటు ఎంతవరకో విశ్లేషించుకుంటూ ఉండిపోయింది. భార్గవని ఉపేక్షించింది. అతను ఇప్పటికే తన జీవితాన్ని కెలికాడు. జరిగిన దానికి పశ్చాత్తాపపడటం లేదు. తననే బెదిరిస్తున్నాడు, జాగ్రత్తగా ఉండమని. ఆమె ముఖం ఎర్రబడింది.

ప్రహ్లాద్ వచ్చాడు ఆమె దగ్గరకి. వెంటనే సర్దుకుంది దగ్గరికి తీసుకున్నాడు. అతని స్పర్శలో ఆమెకి ఎంతో ఓదార్పు ధైర్యం లభించాయి.

★ ★ ★

భార్గవ లేఆఫ్ అయ్యాడు. అది కూడా స్లో వర్కరనే బేడ్ రిమార్కుతో. ఇంకెక్కడేనా ఉద్యోగం దొరకాలంటే చాలా కష్టం. అందులో ప్రహ్లాద్ ప్రమేయం ఉండి ఉంటుందని అర్థమైంది నీలకి. అతని భార్యనీ ఇద్దరు పిల్లల్నీ తలుచుకుంటే బాధనిపించింది. మనిషికి మంచిగా ఉండటం ఒక సామాజిక అవసరం. తన కోసం కాకపోయినా తన వాళ్ల కోసం అతనలా ఉండకపోతే కలిగే పరిణామాలు అతనితో సమంగా ఇంకా మాట్లాడాలంటే అతనికంటే ఎక్కువగా అనుభవిస్తారు.

★ ★ ★

భార్గవ వచ్చాడు నీల దగ్గరకి. ఎవరో అతని భార్యకి చెప్పారట- ఎనిమిదేళ్ల క్రితం అతనో అమ్మాయిని ప్రేమించి మోసం చేసి ఊళ్లో నుంచీ పారిపోయాడని. పగలూ రాత్రి అదే వేధింపట అతనికి ఇంట్లో.

''పూర్తిగా నాశనమైపోయాను. ప్రహ్లాద్ కక్ష కట్టి చేస్తున్నాడు ఇదంతా!'' అన్నాడు దాదాపుగా ఏడుస్తూ.

''నన్నొక చెడ్డ అమ్మాయిగా ఎస్టాబ్లిష్ చేశావు నువ్వు. మంచి భార్యగా మిగలాలంటే ఇవన్నీ తప్పవు. పార్టాఫ్ ద గేమ్. ప్రహ్లాద్‌కి నేనే చెప్తున్నాను ఏం చెయ్యాలో'' అంది నీల.

''జరిగింది చాలు. నీకు దూరంగా వెళ్లిపోతాను. దయచేసి నన్ను మర్చిపో'' అన్నాడు బ్రతిమాలుతూ.

''నిన్ను మర్చిపోకపోతే శరత్‌తో పెళ్లిచూపులకి కూర్చునేదాన్ని కాదు. కానీ నువ్వే నన్ను మర్చిపోలేదు. నీ పురుషహంకారం నన్ను మర్చిపోనివ్వలేదు. ఇద్దరం కలిసి చేసిన తప్పుకి ఎవరి వ్యక్తిగత బాధ్యత వాళ్లది. శరత్‌కి నువ్వెందుకు చెప్పావు. నా గురించి? అలా ఎంతమందికి చెప్పావు? ఎంత బురద చల్లావు నా మీద? ప్రహ్లాద్ పరిచయమవ్వకపోతే... అతనూ నీలాంటి పురుషహంకారి అయితే జీవితాంతం వంటరిగా మిగిలిపోయేదాన్ని. రగిలే జ్వాలకి గాలి తోడైనట్టు ప్రహ్లాద్ నాకు తోడయ్యాడు. మోసగాడైన వ్యక్తి పట్ల అతనికి ఎలాంటి దయా లేదు. ఆ రోజు నీదైతే ఈ రోజు నాది. గెటవే'' అంది నీల కోపంగా.

అతను తలదించుకుని వెళ్లిపోయాడు. ఆ రాత్రే భార్యాపిల్లలని తీసుకుని ఊళ్లోంచీ వెళ్లిపోయాడని తెలిసింది నీలకి. ప్రహ్లాద్ చెప్పాడు.

భార్గవ రెండుసార్లు పారిపోయాడు. చేసిన పనికి బాధ్యత తీసుకోవటానికి భయపడి ఒకసారి, పర్యవసానాలని తట్టుకోలేక రెండోసారి.

